
**కథ**

# దాహం

- వేంపల్లి రెడ్డి నాగరాజు

**"ఏందిరా ఓలిగా నీయమ్మ మొగుని గంటంతా ఎవురో ఎత్తుకోని పోతాన్నెట్లుగా పరిగెత్తుకోని వస్తాండావు?" ఆయాసంతో రొప్పుకుంటూ వచ్చిన పాలేరు ఓబులేశును ప్రశ్నించాడు ప్రెసిడెంటు సంజీవరెడ్డి.**

**"నిన్ను అర్జంటుగా టౌనుకు పిల్చుకొని రమ్మని ఎమ్మెల్యే మనిసిని పంపినాడప్పా, వచ్చిండిటోడు నీ కోసరం ఇంటికాడ ఎదురు జూస్తాండాడు" వేగంగా నడిచి రావడం వల్ల గుండెల్లో నుండి ఎగదన్నుకుని వస్తున్న ఆయాసాన్ని అదుపు చేసుకుంటూ చెప్పాడు ఓబులేశు.**



"ఏం పనో కనుక్కుంటివా?" అడిగాడు సంజీవరెడ్డి వాడి వైపు సాలోచనగా చూస్తూ...

"ఏమోనప్పా నేనడగలా. వాడూ చెప్పలా" బదులిచ్చాడు ఓబులేశు తలకు చుట్టుకొన్న రుమాలు తీసి మొహానికి పట్టిన చెమట తుడుచుకుంటూ....

"చెట్లకు పాదులు తీసి ఎరువులు వెయ్యాలని ఈదినం కూలోళ్లనందరిని రమ్మని చెప్పినాను గదరా" పూత, పిందె దశకు వస్తున్న నిమ్మతోట వైపు దృష్టి సారిస్తూ చెప్పాడు సంజీవరెడ్డి.

"ఇంత చిన్న పనికి గూడా నువ్వే దగ్గరుండాల్నా రెడ్డీ? ఈరోజు ఆదివారమే గదా. కాలేజీ గూడా లేదు. చిన్నపరెడ్డి ఇంటికాడ ఖాళీగానే వుండాడు. నువ్వు ఇంటికి పొయ్యి ఆయప్పను పంపించుపో. నేను తోడుండి చూసుకుంటాగానీ" సమస్యకు పరిష్కారం సూచిస్తున్నట్లుగా అన్నాడు ఓబులేశు.

''వాని వల్ల అయ్యే పనేనంటావారా ఓబిలిగా'' అడిగాడు సంజీవరెడ్డి

''ఇదేం పెద్ద బెమ్మవిద్యేంగాదులేప్పా. వచ్చిండే టోడు తొందరజేస్తాండాడు, గానీ నువ్వు తొందరగా ఎల్లబారు రెడ్డీ'' ఆత్రుత ధ్వనిస్తున్న గొంతుతో చెప్పాడు ఓబులేశు.

''వచ్చినదే కూలోళ్లందరినీ సరిగ్గా లెక్కేసుకొని సందేళకాడికి పని పూర్తయ్యేట్లు జూడండి'' హెచ్చరించినట్లుగా చెప్పి తోట వద్ద నుంచి ఇంటి వైపు బయలుదేరాడు సంజీవరెడ్డి.

***

''రావయ్యా సంజీవరెడ్డీ, నీ కోసమే ఎదురుచూస్తున్నా'' గెస్టహౌస్ వద్ద పార్టీ నాయకులు, ఇతర కార్యకర్తలతో బిజీగా వున్న ఎమ్మెల్యే రామస్వామి రెడ్డి తను పంపిన మనిషి వెంట వస్తున్న సంజీవరెడ్డిని సాదరంగా ఆహ్వానించాడు.

''ఏమన్నా సంగతి. అర్జంటుగా రమ్మని చెప్పి పంపినావు?'' ఎమ్మెల్యే వంక చూస్తూ అడిగాడు సంజీవరెడ్డి.

''రాత్రి పార్టీ ఆఫీసు నుంచి ఫోన్ వచ్చిందయ్యా, మళ్లీ ఎలక్షన్లు వచ్చేందుకు పెద్దగా టైం లేదుగదా. తిరిగి మనమే అధికారంలోకి రావాలంటే మన ప్రభుత్వం ఇన్నాళ్లు చేసిన అభివృద్ధి గురించి వివరించేందుకు పార్టీ జిల్లా అధ్యక్షులను, మంత్రులను నియోజక వర్గాలలోకి పంపుతారట. మీ వూళ్లో మీటింగ్ పెట్టిద్దామనుకుంటున్నా'' చెప్పాడు ఎమ్మెల్యే.

''నేనేం జేయాలన్నా'' ప్రశ్నించాడు సంజీవరెడ్డి.

''మీటింగుకు దండిగా జనం వచ్చేట్లు ఏర్పాటు చేసుకోవాలి కదా'' చెప్పాడు ఎమ్మెల్యే.

''మామూలుగా అందరి మాదిరిగా బస్సులను, లారీలను పల్లెలకు పంపి జనాన్ని తోలుకొస్తే సరి'' అన్నాడు సంజీవరెడ్డి

''ఈ విషయం పేపరోల్లు పసిగడితే కొంచెం కష్టమే గదా. అందుకనే ఈ సారికి జనాల్ని తోలడం వద్దనుకుంటున్నా'' చెప్పాడు ఎమ్మెల్యే.

''అదేందన్నా దండిగా లెక్క మిగిలే కాంట్రాక్టు పనులన్నీ రాఘవరెడ్డికి, ఇలా చిల్లర మల్లర పనులన్నీ నాకా జెప్పేది?'' తన అసంతృప్తిని వెళ్లగక్కాడు సంజీవరెడ్డి.

''ఎవరు ఎట్లాంటి వాళ్లన్న సంగతి ఇప్పుడిప్పుడే తెలుస్తోందిలే సంజీవా'' అనునయిస్తున్నట్లుగా అన్నాడు ఎమ్మెల్యే.

దీంతో కొంచెం మెత్తబడిన సంజీవరెడ్డి ''మీటింగుకి ఎప్పుడు ఏర్పాట్లు చేయలన్నా'' అడిగాడు.

''వచ్చే సోమవారం నాడు జిల్లా ఇన్‌ఛార్జి మినిస్టర్ మన నియోజకవర్గంలో పర్యటిస్తారట. ఆరోజే మీ గ్రామంలో బహిరంగ సభ పెడితే సరిపోతుంది గదా'' చెప్పాడు ఎమ్మెల్యే.

''మనం బహిరంగ సభ పెడితే జనాలు పెద్దగా వస్తారో రారోగదన్నా'' ఎమ్మెల్యే వంకే పరిశీలనగా చూస్తూ సందేహం వ్యక్తం చేశాడు సంజీవరెడ్డి.

''ఎందుకు సంజీవా అట్టంటున్నావు?'' అడిగాడు ఎమ్మెల్యే.

''నువ్వు నమ్మిదెగ్గరికి తీసిండే రాఘవరెడ్డి పనులన్నీ తనోళ్లకే చెప్పుకున్నేడనీ, సన్నజనాల కోసం ఆయప్ప ఏమీ చెయ్యలేదని నీకు తెలీనిదా?'' గ్రామంలో సొంత పార్టీలోనే తన ప్రత్యర్థిగా కొనసాగుతూ, వచ్చే ఎన్నికల్లో ఛాన్సు కోసం ఇప్పటి నుంచే ప్రసిడెంట్ సీటుపై కన్నేసి వుంచిన రాఘవరెడ్డిపై ద్వేషాన్ని మాటల్లోనే వ్యక్తపరిచాడు సంజీవరెడ్డి.

''మీ గ్రామంలో సన్నజనాలు రాఘవరెడ్డిపై అసంతృప్తితో వున్నారనీ, వాళ్లంతా నువ్వు చెప్పినట్లు వింటారనే గదా సంజీవా నిన్ను పిలిపించింది'' చెప్పాడు ఎమ్మెల్యే.

''మన గవర్మెంటు అభివృద్ధి చేసిందని చెప్పినా వినేటోల్లు వుండాలగదా?'' తన పట్టు సడలిస్తూనే అడిగాడు సంజీవరెడ్డి.

''నువ్వే అలా అంటే ఏం చెప్పేది సంజీవా?'' అన్నాడు ఎమ్మెల్యే.

''మన గవర్నమెంటు వచ్చినకాడి నుంచి అన్నిటికీ రేట్లు బాగా పెరిగిపోయినాయని, కరెంటు సక్రమంగా లేదని, ఎరువులు కావల్సినన్ని దొరకలేదని, సేద్యగాళ్లు ఈసారి చానా నిష్టూరంగా వుండారన్నా'' చెప్పాడు సంజీవరెడ్డి ఎమ్మెల్యే మొహంలో మారుతున్న మార్పుల్ని గమనిస్తూ.

''మీ పల్లెకు వచ్చేది మినిష్టరు గాబట్టి ఏదైనా పెద్ద సమస్య వుంటే చెప్పు. అక్కడికక్కడే శాంక్షన్ చేయించుకుందాం. నీకు మంచి పేరూ వస్తుంది. పంచాయితీ ఎన్నికల్లో మళ్లీ నువ్వే గెలుస్తావు'' ఎర గుచ్చిన గాలాన్ని విసిరాడు ఎమ్మెల్యే.

ఈసారి కూడా సర్పంచ్‌గా పోటీ చేసే అవకాశం తనకే ఇస్తున్నట్లు సాక్షాత్తు ఎమ్మెల్యేనే చెప్పడంతో సంతృప్తి చెందిన సంజీవరెడ్డి బహిరంగ సభ విషయమై మరికొంత సేపు మాట్లాడి అక్కడి నుంచి వెనుదిరిగాడు.

***

''మీరంతా నీళ్ల కోసం ఏరకమైన ఇబ్బందీ పడకుండా, కడవలు చేతపట్టుకొని సేద్యపు బావుల కాడికీ, చెరువుల కాడికీ పొయ్యేపని లేకుండా చెయ్యాలనుకుంటా వుండా'' ఓబులేశుతో కబురు పంపగా తన ఇంటి వద్దకు వచ్చి సమావేశమైన ఎగువపల్లె, దిగువపల్లె జనాలతో చెప్పాడు సంజీవరెడ్డి.

''ఎట్టనో ఒగట్ట నువ్వే మా ఇబ్బందులు తీర్చాల సామీ'' గుంపులో నుంచి లేచిన కొందరు మహిళలు, వృద్ధులు అన్నారు. రెండు చేతులు జోడించి దండం పెడుతూ.

''సోమవారం నాడు మనూరికి మినిష్టర్, ఎమ్మెల్యే వస్తాండారు. మీ సమస్య గురించి మీ ముందరే వాళ్లతో మాట్లాడతా గానీ, మీరంతా ఎవురి ఎనకంబడి పోకుండా నేరుగా మా ఇంటికాడికి వచ్చేయ్యాల్ల'' అన్నాడు సంజీవరెడ్డి.

''అట్టనేప్పా, అదేపనిగా పిల్చి మా ఇబ్బంది తీరుస్తాననే నీకాడికి కాకుండా వేరే వాల్లకాడికి పొయ్యే అవసరం మాకేముందీ?'' అంటూ ఇళ్లకు తిరుగుముఖం పట్టారు రెండు పల్లెల ప్రజలు.

***

ముందుగా అనుకున్న ప్రకారం సోమవారం నాడు గ్రామానికి మినిష్టర్, ఎమ్మెల్యేతో పాటుగా జిల్లాలోని ఇతర ముఖ్య నేతలు రావడం, బహిరంగ సభకు వెళ్లే దారిలోనే సంజీవరెడ్డి ఇంట్లో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో పాల్గొనడం, ఆ సందర్భంగానే గుమిగూడిన వందలాది మంది జనాలు తమ నాయకుడు సంజీవరెడ్డికి 'జై' కొడుతూ మినిష్టరుకు తమ త్రాగునీటి సమస్య విషయమై అర్జీ అందించడం జరిగిపోయాయి.


ప్రత్యేకంగా వండి వడ్డించిన 'వేటమాంసం' తినడం వల్లనూ, గ్రామంలో ప్రజల మద్దతు రాఘవరెడ్డి కంటే సంజీవరెడ్డికే ఎక్కువగా వుందని గ్రహించడం వల్లనూ తృప్తి చెందిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి కోరిక మేరకు నీటి సమస్యపై హామీ కోసం మినిష్టరుపై ఒత్తిడి తెచ్చాడు.

మినిష్టరు సైతం రానున్న ఎన్నికలను దృష్టిలో వుంచుకొని సమస్యను తొలగించే వీలుగా 'వాటర్ స్కీం' మంజూరు చేస్తూ బహిరంగ సభలోనే కరతాళ ధ్వనుల మధ్య ప్రకటించాడు.

***

సరిగ్గా వారం రోజుల తర్వాత....

ఉదయం పదకొండు గంటల ప్రాంతంలో జిల్లా కేంద్రంలోని వాటర్ వర్క్స్ కార్యాలయం ప్రాంగణం కాంట్రాక్టర్లు, పలువురు నాయకులు వారి అనుచరగణంతో రద్దీగా వుంది.



"రండి సంజీవరెడ్డి గారూ ఈ మధ్య టౌనుకు రావడమే మానుకున్నట్లున్నారే?" జీపు దిగి గుమ్మం దాటుకుని తన ఛాంబర్‌లోకి వస్తున్న సంజీవరెడ్డిని నవ్వుతూనే ఆహ్వానించాడు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోపాలరావు.

"ఎప్పుడూ పెద్ద పెద్ద కాంట్రాక్టర్లతోనూ, ఎమ్మెల్యేలతోనూ బిజీగా వుండే మీలాంటోళ్ల దర్శనం మాకు అంత తొందరగా దొరుకుతుందా సార్" తను కూడా నవ్వుతూనే అన్నాడు సంజీవరెడ్డి ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుంటూ.

"మీ విలేజ్‌లో రక్షిత మంచినీటి పథకం ఏర్పాటుకు సంబంధించి సర్వే జరిపి రిపోర్టు పంపమని ఈ రోజే పై ఆఫీసు నుంచి కాగితం వచ్చిందండీ. ఈ విషయం మినిస్టర్ గారి 'పర్సనల్ ఇంట్రస్టెడ్ కేస'ని మా సూపరిండెండెంట్ ఇంజనీర్ గారు కూడా ఫోన్ చేసి చెప్పారు" అన్నాడు గోపాల్‌రావు.

"ఆ సంగతి మాట్లాడేదానికే ఇప్పుడు వచ్చినా సార్" అన్నాడు సంజీవరెడ్డి.

"నీటి జాడ కనిపెట్టి పాయింట్ గుర్తించేందుకు జియాలజిస్ట్‌ను పంపాలనుకుంటున్నాను. మీరు ఎప్పుడు రమ్మనేది చెబితే ఆరోజే పంపుతాను" చెప్పాడు గోపాల్‌రావు.

"బోరు గుంత వేసి, ట్యాంకు కట్టించి గ్రామంలో పైపులైన్లు వేసేదానికి గవర్మెంటు ఎంత శాంక్షన్ చేస్తుంది సార్" అడిగాడు సంజీవరెడ్డి.

"మా ఎస్టిమేషన్ ప్రకారం కనీసం పది లక్షలు వస్తుంది" చెప్పాడు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్.

జేబులో నుంచి వందనోటు తీసి అక్కడే వున్న అటెండర్‌ను పిలిచి కూల్‌డ్రింక్స్ తెమ్మని పురమాయిస్తూ, "ఈ పని నేనే కాంట్రాక్ట్ దక్కించుకుంటే ఎంత మాత్రం మిగుల్చుకోవచ్చు" ఆసక్తిగా ప్రశ్నించాడు సంజీవరెడ్డి.

"పనులు ఎంత నాణ్యంగా చేసినా ఖర్చులు, కమీషన్లు పోనూ కనీసం లక్ష దాకా మిగల వచ్చండీ" చెప్పాడు గోపాల్‌రావు. కమీషన్లు అన్న పదాన్ని వత్తి పలుకుతూ.

కాస్సేపు కబుర్ల తర్వాత ఇక తాను వెళతానన్నట్లుగా లేచిన సంజీవరెడ్డి ఈ రాత్రికి తాను ఇట్నుంచి ఇటే హైదరాబాదుకు వెడుతున్నాననీ, ఈలోగానే వీలైనంత త్వరగా బోర్ పాయింట్ ఏర్పాటుకు జియాలజిస్ట్‌ను గ్రామానికి పంపమని, ఆ తర్వాత తన తమ్ముడు వచ్చి కలుస్తాడని చెప్పి వెళ్లిపోయాడు సంజీవరెడ్డి.

***

"ఆ గంగమ్మ తల్లికి మా మీద దయ లేనప్పుడు, మా తలరాతలు ఇంతే అయినప్పుడు నువ్వు ఎన్ని రకాలుగా పొరకలాడినా ఏం ఫలంలే రెడ్డీ" నిట్టూరుస్తూ అన్నాడు ఎగవపల్లె గురవయ్య. ఆ రోజు ఉదయమే హైదరాబాద్ నుంచి ఇల్లు చేరుకున్న సంజీవరెడ్డితో.

"ఏం జరిగిందిరా? అట్ట అంగలారుస్తావుండావు?" ప్రశ్నించాడు సంజీవరెడ్డి.

"నిన్న బోరింగు డిపార్ట్‌మెంటోళ్లు, వొచ్చిరి రెడ్డి. పాయింటు పెట్టేదానికి. నీళ్ల జాడ కోసరం పది, పన్నెండు తావుల్లో చూసినారు గానీ యాడగానీ సుక్క నీల్లు లేవని చెప్పేసిపోయిరి" బాధతో చెప్పాడు అక్కడే వున్న దిగువపల్లె సాంబయ్య కూడా.

"అరె అట్టనా మీరేమి మదనపడగాకండి గానీ సాయంత్రం మీ రెండు పల్లెల్లో వుండే అందరినీ రమ్మని చెప్పండి. ఒక విషయం మాట్లాడాల" అన్నాడు సంజీవరెడ్డి.

"సరేనబ్బా" అంటూ వెళ్లిపోయారు ఇద్దరూ. అదే రోజు రాత్రి ఎనిమిది గంటల సమయంలో...

"మధ్యాన్నం టౌనుకు బోయిచ్చినా. ఇంజనీరుతో మాట్లాడితే మీ రెండుపల్లెల్లో నీళ్ల జాడేలేదంట. బాగా ఆలోచించిన మీదట ఒక నిర్ణయానికి వచ్చినా" అన్నాడు సంజీవరెడ్డి తన ఇంటి వద్ద గుమిగూడిన జనాలను ఉద్దేశించి.

రెడ్డి ఏం చెబుతాడా అని అందరూ ఆత్రంగా ఎదురు చూస్తున్నారు.

"మా దొడ్లో వుండే గిలక బాయికి మోటారు బిగించి మీరెండు పల్లెలకు పైపులు కనెక్షన్ ఇస్తామనుకుంటాండా" చెప్పాడు సంజీవరెడ్డి. మళ్లీ తనే కొనసాగిస్తూ "ఖర్చు గూడా అంతా నాదేలేరా. మీరేం దిగులు పడగాకండీ" అన్నాడు.

"నమ్ముకోనుండే సన్నజాతోళ్ల కోసం నువ్వు ఇంత ఇదిగా చేస్తావనుకోలేదు రెడ్డీ" ఆనందంతో ఇంకా ఏదో అనబోయారు ఒకరిద్దరు నమ్మలేనట్లు చూస్తూ.

"మీరు కడ జాతోళ్లని, నేను పెద్దకులమోడినని మన మధ్యన తేడాలు ఎందుకు గానీ పొద్దుపోయింది, ఇక బయలుదేరండి" చెప్పి తను కూడా ఇంట్లోకి దారి తీశాడు.

ఆ రాఘవరెడ్డల్లాటోల్లు నూరు మంది వుండీ ప్రయోజనం లేదుగానీ, ఈ సంజీవరెడ్డిలాంటోల్లు వొక్కరుంటే సాలదా అనుకుంటూ సంజీవరెడ్డి మంచితనాన్ని పొగుడుకుంటూ అంతా పల్లెల వైపు వెనుదిరిగారు.

***

"రేయ్, చిన్నపరెడ్డీ, రేపు కాలేజీకి పోయినప్పుడు బీరువాలో పెట్టిండే పదివేల లెక్క తీసుకొని పోయి నిన్న బోరింగు పాయింటుల్లు చూసేదానికి వచ్చిండే ఇంజనీరుకు ఇచ్చేసిరా" రాత్రి భోజనాల దగ్గర తమ్ముడితో చెప్పాడు సంజీవరెడ్డి."నీళ్లు పడి కనీసం మనకు కాంట్రాక్టు పనన్నా దక్కివుంటే ఇచ్చినా ఫర్వా లేదు గానీ ఎన్ని పాయింట్లు చూసినా నీళ్లు పడవని చెప్పినప్పుడు ఈ దండగ ఖర్చు ఎందుకు అన్నయ్యా" కాస్తంత అసహనంగానే ప్రశ్నించాడు చిన్నపరెడ్డి.

"ఆ రెండు పల్లెల్లో ఎక్కడా నీళ్లు పడవని చెప్పమని ఇంజనీర్‌ను, జియాలజిస్టును నేనే మేనేజ్ చేసినాలేరా" చెప్పాడు సంజీవరెడ్డి

"ఎందుకట్ల?" అయోమయంగా చూశాడు చిన్నపరెడ్డి అన్నవైపు.

"వచ్చే మండల ఎలక్షన్లలో మన మండలం, మన ఎంపిటిసి స్థానం రెండూ ఆడోళ్లకు రిజర్వ్ జేస్తాండారంట. ఆ రాఘవరెడ్డి గాడు వాని పెండ్లాన్ని నిలబెట్టి కాంట్రాక్టు పనుల్లో ఇంతకాలం సంపాదిచ్చిండే లెక్క ఓట్ల కోసం ఎదజల్లినాడంటే వాని ముందు మనం తట్టుకోగలుగుతామా?" అడిగాడు సంజీవరెడ్డి.


"దానికీ, దీనికి ఏమిటి సంబంధం?" అర్థం కానట్లు ప్రశ్నించాడు చిన్నపరెడ్డి.

"రేపొద్దున్న మీ వదిన ఎంపిటిసి మెంబర్‌గా గెల్చి ఎమ్మెల్యే సపోర్టుతో మండలాన్ని మనం సొంతం చేసుకోవల్లంటే ఆ రెండు పల్లెల ఓట్లన్నీ మనకే పడాల, అందుకనే వాళ్లంతా రాఘవరెడ్డి కాడ ఓట్ల కోసం లెక్క తీసుకున్నాగానీ, మీ వదినను గెలిపించకపోతే వాళ్ల పల్లెలకు మనం నీళ్లు నిలిపివేస్తామనే భయంతో వుంటారు. ఆ భయమే మీ వదినను గెలిపిస్తాది" చెప్పాడు సంజీవరెడ్డి. పల్లె ప్రజల తాగునీటి అవసరాన్ని తమ రాజకీయ దాహాన్ని తీర్చుకునేందుకు చక్కని అవకాశంగా ఏ రకంగా ఉపయోగించుకోవచ్చనే విషయం అర్థమయ్యేట్లుగా వివరిస్తూ.

"నువ్వు నా మాదిరి చదువుకుని వుంటే ఇంకా పెద్ద స్థాయికి చేరుకునేవాడివి. లక్షల ఖర్చును పదివేలతోనే భలే మేనేజ్ చేస్తున్నావు కదన్నయ్యా." తన అన్న వైపు అబ్బురంగా చూశాడు చిన్నపరెడ్డి.

"ఇట్లాంటివన్నీ కాలేజీల్లో నేర్పించే విషయాలు కాదులేరా" అన్నాడు సంజీవ రెడ్డి అన్నంలోకి మజ్జిగ పోసుకొని కలుపుకుంటూ.

*



## షాహిద్ కండలకు షారుక్ ప్రేరణ!

కండలు తిరిగిన దేహాలతో ప్రేక్షకులను ఆకట్టుకునే బాలీవుడ్ హీరోల్లో షాహిద్ కపూర్ ఒకరు. అయితే షాహిద్ కపూర్‌కు తన దేహంపై శ్రద్ధ కలగడానికి ముఖ్య కారణం ఎవరో తెలుసా? షారుక్ ఖాన్! షాహిద్ కపూర్ సినిమా హీరో కాకముందు నృత్య దర్శకుడు షియామక్ దావర్ నిర్వహించే డాన్స్ ట్రూపులో డాన్సర్‌గా పనిచేసేవాడు. ఒక రోజు షారుక్ ఖాన్ అటుగా పోతూ వీళ్ళ డాన్స్ ప్రదర్శనను చూసిపోవడానికి ఇలా వచ్చాడట. అక్కడ డాన్సర్ల గుంపులో వున్న షాహిద్‌ని చూసి షియామాక్‌తో, "ఏంటి, నువ్వు నీ డాన్సర్లకి సరిగ్గా తిండి పెట్టవా?" అని అడిగాడట. ఎందుకంటే, అప్పట్లో షాహిద్ చాలా సన్నగా పీలగా ఉండేవాడు. ఈ కామెంట్‌ని మాత్రం అతను చాలా సీరియస్‌గా తీసుకున్నాడు. అప్పటి నుండీ శరీరంపై శ్రద్ధ పట్టి వ్యాయామం మొదలు పెట్టాడట. ఇటీవల ఓ టీవీ ఛానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో అతను ఈ విషయం బయటపెట్టాడు.